జూదరుల అరెస్టు

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని గిరిప్రసాద్ కాలనీ వద్ద కంపచెట్లలో పేకాటతోపాటు కోడిపందేలు ఆడుతున్న వారిపై దాడి చేసి 35 మంది జూదరులను అరెస్టు చేసినట్లు సిఐ నాగార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని గిరిప్రసాద్ కాలనీ వద్ద కంపచెట్లలో అనంతపురం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కొందరు భారీగా జూదం, కోడి పందేలు ఆడుతుండేవారు. ఈనేపథ్యంలో అనంతపురం రూరల్ ఎస్‌డిపిఒ వెంకట శివారెడ్డి ఆదేశాల మేరకు పక్కాగా అందిన సమాచారంతో సిబ్బంది కలిసి వలపన్ని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో సుమారు 35 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.1,51,990తోపాటు మూడు కోడి పందేలు, రెండు కోడి కత్తులు, 35 మొబైల్ ఫోన్లు, 15 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందులను కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

పంటల బీమాను ప్రకటించాలి : ఏపి రైతు సంఘం

ఆందోళనలో పాల్గొన్న నాయకులు, రైతులు

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం

పంటల బీమాను వెంటనే ప్రకటించాలని ఏపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ నల్లప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ 2022లో అతివృష్టి అనావృష్టి వల్ల అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వేరుశనగ, పత్తి, కంది పొలాల్లోని కుళ్ళిపోయి మొలకలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయాన్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడికూడా రాకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. 2019లో 46 మంది, 2020లో 67 మంది, 2021లో 44, 2022లో 62 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఖరీఫ్ 2022లో వేరుశనగ 2 లక్షల హెక్టార్లలో, పత్తి 77 వేల హెక్టార్లలో, మిరప 27 హెక్టార్లలో దెబ్బతిన్నాయన్నారు. వీటితో పాటు చీనీ, అరటి, దానిమ్మ, టమోటా తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. రైతుల ఆందోళన చేస్తే ప్రభుత్వం పంటల బీమా ద్వారా రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇప్పటివరకు బీమా ప్రకటించకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఖరీఫ్ ప్రారంభంతో పెట్టుబడులకు డబ్బులు లేక అప్పులు పుట్టక రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతోందని వాపోయారు. వెంటనే పంటల బీమా ప్రకటించి వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులు, సిపిఎం మండల కార్యదర్శి పుల్లయ్య, నెట్టికల్లు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ భూములను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం

మండల పరిధిలోని జంతలూరు గ్రామ సమీపంలో నిర్మిస్తున్న కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ గౌతమి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం అక్కడ జరుగుతున్న వివిధ నిర్మాణాల పనులను పరిశీలించారు. అలాగే సెంట్రల్ యూనివర్సిటీ భూములకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణపు పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మొదటి దశలో భాగంగా హాస్టల్ బిల్డింగులు, అకాడమిక్ బిల్డింగ్, ఎస్టేట్ ఆఫీస్ తదితర నిర్మాణాల గురించి సిపిడబ్ల్యుడిఇఇ శ్రీనివాసులు, ప్రొఫెసర్ హనుమాన్, కెనడి యూనివర్సిటీ డీన్ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ రామిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. 491.30 ఎకరాలలో నిర్మిస్తున్న పనుల వివరాలను తెలుసుకుంటూ లాండ్ మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యూనివర్సిటీకి కేటాయించిన సర్వే నంబర్లలో ఉపాధి హామీ పనులను చేపట్టకూడదని, భూమి హద్దులకు సంబంధించి మరోసారి పరిశీలన చర్యలు చేపట్టాలని ఆర్డీవో మధుసూదన్, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ విజయభాస్కర్, సర్వేయర్ రఘునాథ్‌ను ఆదేశించారు. రెవెన్యూ రికార్డులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని, సర్వే ముటేషన్ తదితర వివరాలను తనకు సమర్పించాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో చుట్టుపక్కన గ్రామస్తులకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజశేఖర్, సంయుక్త జిల్లా కలెక్టర్ శ్రీ కేతన్ గార్గ్‌అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ తలారి రంగయ్య, జెడిఎ ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లా లో చిరుధాన్యాల సాగు పై రైతులకు ఆర్‌బికె స్థాయిల్లో అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జొన్న, రాగి, కొర్ర విత్తనాలను రాయితీపై అందిస్తున్నామన్నారు. రైతులు పండించిన చిరుధాన్యాల పంటలను సివిల్స్ సప్లయ్స్ ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేస్తామన్నారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు చిరుధాన్యాల సాగుపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు ఇస్తామన్నారు. అలాగే భూయజమాని కౌలు రైతుల సిసిఆర్‌సి కార్డుల మంజూరుకు సహకరించాలని కోరారు. దీని వల్ల భూ యజమానికి ఎలాంటి నష్టం జరగదని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఆలమూరు సుబ్బారెడ్డి, జిల్లా స్థాయి వ్యవసాయ, అనుబంధ స్థాయి అధికారులు, డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత

నగర మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నగర మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులకు కిమ్స్ సవేరా సహకారంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత గుండె పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహమ్మద్ వసీం డిప్యూటీ మేయర్ వాసంతి, విజయభాస్కర్ రెడ్డి,కమీషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ కార్మికులు నిత్యం పని ఒత్తిడి తోపాటు పారిశుధ్య నిర్వహణతో త్వరగా అనారోగ్యాల బారిన పడుతుంటారన్నారు. అంతేకాకుండా ఆరోగ్యాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తుంటారని వారికి ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యాన్ని కాపాడాలన్న లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇటీవల నిర్వహించిన గుండె వైద్య శిబిరంలో కొందరు కార్మికులు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలను అందించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. దశలవారీగా ప్రతి సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ప్రతి కార్మికునికి ఉచిత వైద్య శిబిరం ద్వారా గుండె సంబంధిత పరీక్షలను నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా కార్మికుల సంక్షేమం కోసం అవసరమైన పరికరాలను ఎప్పటికప్పుడు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చంద్రమోహన్, ఇషాక్, లాలూ, ఎంహెచ్ఒ గంగాధర్ రెడ్డి, కిమ్స్ సవేరా హాస్పిటల్ వైద్యులు రామ్ కుమార్, కావ్య, రోహిత్, సుష్మిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో అందుతున్న చికిత్సలను పరిశీలిస్తున్న మేయర్, తదితరులు

రాయదుర్గంలో మూడు రోజులు నీటి సరఫరా బంద్

రాయదుర్గం : ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజులు పాటు రాయదుర్గం పట్టణంలో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద సంపు, రాయదుర్గం పొలిమేరలోని ఫిల్టరేషన్ పాయింట్ వద్ద కొత్త మోటార్ల ఏర్పాటు, పంపింగ్ పైప్‌లైన్‌లో రెండు చోట్ల లీకేజీల మరమ్మతుల కారణంగా మూడు రోజులపాటు పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపా రు. 21వ తేదీ నుంచి నీటి సరఫరా తిరిగి పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. రాయదుర్గం పట్టణ ప్రజలు పురపాలక సంఘంతో సహకరించాలని కోరారు.

కొలత... కలత

'వెనుక దగా..ముందు దగా...అన్న మహాకవి మాటలు జిల్లాలోని కొందరు వ్యాపారులకు అతికినట్టు సరిపోతాయి. వస్తువుల క్రయ విక్రయాల్లో భారీగా మోసాలకు పాల్పడుతున్నారు. తూనికలు, కొలతల్లో దగా చేస్తున్నారు. కల్తీ రాజ్యమేలుతోంది. వినియోగదారుడు నిలువు దోపిడీకి గురవుతున్నాడు. వీటిని నియంత్రించాల్సిన తూనికలు, కొలతలు, ఆహార కల్తీ నిరోధక శాఖలు నిద్దరోతున్నాయి.

తూనికలు, కొలతల్లో మోసం
వస్తువుల క్రయ, విక్రయాల్లో దోపిడీ
పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ విక్రయాల్లో తేడాలు

ప్రజాశక్తి-హిందూపురం

పండ్ల నుంచి కూరగాయల వరకూ, సిమెంటు నుంచి ఎరువుల వరకూ, పెట్రోలు, డీజిల్ ఇలా ప్రతి వస్తువు విక్రయంలోనూ జిల్లాలో భారీగా మోసాలు చోటు చేసుకుంటున్నాయి. ఓవైపు కల్తీ... మరోవైపు తూకాల్లో మోసాలతో వినియోగదారులు నష్టపోతున్నారు. కొందరు వ్యాపారులు కనీస ప్రమాణాలు పాటించడం లేదు. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ అమ్మకాల్లో ఎక్కువగా మోసం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా వందకుపైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి. కొన్ని పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ట్యాంపరింగ్ చేస్తున్నాయి. లీటరు పెట్రోల్‌కు 100 నుంచి 200 మిల్లీలీటర్ల వరకూ పక్కదారి పట్టిస్తున్నారు. బంకుల వద్ద కనీస నిబంధనలు పాటించడం లేదు. ఏరోజు కారోజు పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించాల్సి ఉన్నా ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. కొన్ని బంకుల్లో కల్తీ జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. హిందూపురంతో పాటు అనంతపురం జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లోని బంకుల్లో కల్తీ జరుగుతున్నట్లు, కొలతల్లో తేడాలు ఉంటున్నట్లు అధికారుల తనిఖీలో గతంలో వెల్లడైంది. అక్కడితో తనిఖీలు ఆగిపోయాయి. ఎప్పుడో గానీ సంబంధిత అధికారులు కదలడం లేదు. పెట్రోల్ నాణ్యతను తెలుసుకునేందుకు బంకుల వద్ద ఫిల్టర్ పేపర్ టెస్ట్ అందుబాటులో ఉంచాలి. ఆ పేపరుపై రెండు మూడు చుక్కలు పెట్రోల్ వేస్తే అది ఆవిరైపోతే నాణ్యత కలిగినదిగా గుర్తించవచ్చు. అదే మరకలుగా మిగిలిపోతే కల్తీ జరిగినట్లు నిర్ధారించవచ్చు. ఈ విషయం చాలామంది వినియోగదారులకు తెలియదు. ప్రస్తుతం లీటరు పెట్రోల్ ధర రూ.116కి చేరింది. డీజిల్ రూ.100దాటింది. ఇదే సమయంలో కల్తీ, తూకాల్లో తేడాలతో వినియోగదారుడు కుదేలవుతున్నాడు. బంకులు అందుబాటులో లేనిచోట విడిగా విక్రయాల పేరిట భారీ దోపిడీ జరుగుతోంది. లీటరు పెట్రోల్‌కు రూ.120కుపైగా విక్రయిస్తున్నారు. పైగా కల్తీ పెట్రోల్ అమ్మకాలు చేస్తున్నారు. దీంతో వాహనాల ఇంజన్లు పాడవుతున్నాయి.

సిమెంట్, ఇనుము విక్రయాల్లోనూ అదే పరిస్థితి

గృహ నిర్మాణ సామగ్రి అమ్మకాల్లో కూడా మోసాలు జరుగుతున్నాయి. 25 కేజీల సిమెంట్ బస్తా వద్ద కేజీ, కేజీన్నర తరుగు వస్తోంది. కంపెనీలు నిబంధనల సంగతి పక్కన పెడితే, కొంతమంది దళారులు బస్తాల్లోని సిమెంట్ తీసి రీ ప్యాకింగ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇనుము కేజీల లెక్కన విక్రయించాల్సి ఉన్నా జిల్లాలో చాలామంది వ్యాపారులు విడి పరికరాల కింద అమ్ముతున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా గృహ నిర్మాణం జోరుగా సాగుతోంది. జగనన్న కాలనీలు, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల నిర్మాణానికి సిమెంట్, ఇనుము ఎక్కువ అవసరం. నిత్యం లక్షలాది రూపాయల క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. ఇదే అదునుగా వ్యాపారులు తూనికలు, కొలతల్లో మోసానికి పాల్పడుతున్నారు.

వంట గ్యాస్‌లో నయా మోసం

వంట గ్యాస్‌లో కూడా మోసం పెరుగుతోంది. కొన్ని ఏజెన్సీలు ప్రభుత్వం ఇచ్చే ఇన్సెంటివ్ కాకుండా డెలివరీ ఛార్జీల పేరిట అదనంగా వసూలు చేస్తున్నాయి. గ్యాస్ సిలిండర్లలోనూ కొన్నిచోట్ల తరుగు ఉన్నట్టు తెలుస్తోంది. ఒక్కో సిలిండర్ వద్ద రెండు కిలోల వరకూ తగ్గుముఖం పడుతోంది. డెలివరీ బాయ్స్ బాదుడు సంగతి చెప్పక్కరలేదు. ఒక్కో సిలిండర్‌పై సగటున బిల్లుతో పాటు అదనంగా రూ.20 నుంచి రూ.50 వరకూ వినియోగదారుడు చెల్లించుకోవాల్సిందే.

నిత్యావసరాలూ అంతే...

నిత్యావసరాలు, ఇతర ఆహార పదార్థాలు, పండ్ల తూకాల్లో మోసాల సంగతి చెప్పనక్కర్లేదు. కిలో దగ్గర 200 గ్రాముల వరకూ తగ్గించి అమ్ముతున్నారు. కొన్ని వస్తువులను ప్రామాణిక ముద్రతో విక్రయించాల్సి ఉన్నా ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. ప్రధానంగా వారపు సంతలు, మార్కెట్లు, రైతు బజారుల్లో సైతం రాళ్లనే తూనికలకు వినియోగిస్తున్నారు. ఇక సాధారణ తూనికరాళ్లపై ఎటువంటి ముద్రలూ ఉండవు. గ్రామీణ ప్రాంతాల్లోనైతే వ్యాపారులు చెప్పిందే వేదం. తూనికలు, కొలతల శాఖ అధికారులు తూతూమంత్రపు తనిఖీలకే పరిమితమవుతున్నారు. సిబ్బంది కొరత పేరుతో సంబంధిత అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు. హిందూపురం పట్టణంలో కూరగాయాల మార్కెట్‌తో పాటు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మేళాపురం సర్కిల్ వరకు, ఇతర ప్రాంతాలలో పండ్ల వ్యాపారుల్లో అత్యధిక శాతం తూనికల్లో యథేచ్ఛగా మోసాలకు పాల్పడుతున్నారు. ఇక ఆహార కల్తీ నియంత్రణ అధికారుల జాడే లేకుండా పోతోంది. వారు వచ్చినా తూతూ మంత్రంగా తనఖీలు చేసి పోతాన్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరముంది. స్వీట్ల దుకాణాల్లో వాటిపై తయారీ తేదీ ఉండాలనే నిబంధన ఉన్నప్పటికి జిల్లా కేంద్రంతో సహా ఎక్కడా ఒక్క షాపులోనూ వీటిని ముద్రిస్తున్న దాఖలాలు లేవు. ఇక హోటళ్లలో అయితే రూ.300 పెట్టి ఒక బిర్యాని కొన్నా కనీసం తాగునీరు ఇవ్వడం లేదు. హోటళ్ల నిర్వాహకులు చెప్పిందే ధర...ఇచ్చిందే భోజనం అన్నట్లు ఉంది. వీటిపై ఆహార కల్తీ నియంత్రణ అధికారులతో పాటు తూనికలు కొలతల శాఖ, రెవిన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు సైతం తనఖీలు చేయడానికి అధికారాలు ఉన్నప్పటికి ఎవరు చేయడం లేదు.

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం

తూనికలు, కొలతలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఎక్కడైనా మోసాలు జరిగితే వెంటనే ఫిర్యాదు చేయాలి. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నాం. వ్యాపార సంస్థలు నిర్ణీత ప్రమాణాలు పాటించాలి. లేకుంటే చర్యలు తప్పవు. సిబ్బంది కొరత ఉంది, ఉన్నా ఉన్నంతలో తనిఖీలు చేపడుతున్నాం.

సుధాకర్,
తూనికలు, కొలతల నియంత్రణ జిల్లా అధికారి

2022 పంటల బీమా ప్రకటించాలి

వజ్రకరూరు సిపిఎం మండల కన్వీనర్ విరుపాక్షి

ప్రజాశక్తి-ఉరవకొండ

2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల బీమాను వెంటనే ప్రకటించాలని సిపిఎం వజ్రకరూరు మండల కన్వీనర్ విరుపాక్షి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు చిన్నహోతూరు, పెద్దహోతూర్ గ్రామాల్లోని సచివాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. అనంతరం ఆయా సచివాలయాల అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టి కారణాల వల్ల రైతులు సాగుచేసిన వేరుశెనగ, పత్తి, మిరప, కంది, తదితర పంటలు పొల్లాలోనే కుళ్లిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రూ.లక్షలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన రైతులు చాలామంది దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఫలితంగా కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో వేరుశనగ రెండు లక్షల హెక్టార్లలో, పత్తి 77 వేల హెక్టార్లలో, మిరప 27 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారన్నారు. 2021లో పెండింగ్‌లో ఉన్న పంటల బీమా రూ.39 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో అన్నిరకాల విత్తనాలతోపాటు ఎరువులు, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా సీ2 ప్లస్ 50 శాతం ఫార్ములా ప్రకారం మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. చీనీ, మామిడి, నిమ్మ పంటల అమ్మకాల్లో మారెట్లలో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలన్నారు. రాయలసీమ అభివృద్ధికి అభ్యంతరకరంగా నిర్మించ తనిపెట్టిన అప్పర్ భద్ర నిర్మాణ అనుమతులను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజేష్, దేవేంద్ర, రైతుసంఘం నాయకులు నాగరాజ్, గోపాల్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

20న గురుకులం ప్రవేశ పరీక్ష

గుమ్మఘట్ట : మహాత్మ జ్యోతిబా పూలే వెనకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలలో 6, 8, 9వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థినులకు ఈనెల 20న ఉదయం 11 గంటలకు పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతిలో బీసీ- డీ-1, ఎస్సీ-2, 8వ తరగతిలో బీసీ-ఎ-1, బిసి-బి-2, ఎస్సీ-1, ఎస్టీ-1, 9వ తరగతిలో బీసీ-ఏలో-1 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆయా ఖాళీలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలి

మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్రంలో ఉన్న ప్రతి పేద విద్యార్థీ ఉన్నత చదువులు చదవాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో జగనన్న ఆణిముత్యాలు, జగనన్న విద్యాకానుక నియోజకవర్గ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థి అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో సిఎం జగన్ ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వీటితోపాటు నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, ఎంఇఒ విజయలక్ష్మిలతోపాటు ఆయా శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లితండ్రులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

ఇళ్లల్లోకి పాములు, తేళ్లు ..!

'చాగల్లు'తో బాత్రూముల్లో కూడా ఊటనీరే.. పునరావాసం కల్పించండి.. కలెక్టర్ ఎదుట పెద్దయక్కలూరు వాసుల ఆవేదన

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

'గ్రామంలో ఎక్కడ చూసినా ఊటనీరు దర్శనమిస్తోంది.. దీంతో విషజ్వరాలు ప్రబలడంతోపాటు ఇళ్లలోకి పాములు, తేళ్లు వస్తున్నాయి..' అంటూ మండల పరిధిలోని పెద్దయక్కలూరు ఎస్సీకాలనీవాసులు కలెక్టర్ గౌతమి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని చాగల్లు ప్రాజెక్టు కింద ఉన్న పెద్దయక్కలూరు గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. దాదాపు 12 ఏళ్లుగా పెద్దయక్కులూరు ఎస్సీ కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఊటనీటితోపాటు పలు సమస్యలను ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఉన్నతాధికారులతోపాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వినతికి స్పందించిన కల్టెర్ ముందుగా చాగల్లు ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురైన గ్రామాల వివరాలు తెలుసుకుని పెద్దయకులూరు గ్రామంలో పర్యటించారు. ఎస్సీ కాలనీ అంతా కలియ తిరిగి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీవాసులు పలు సమస్యలపై కలెక్టర్ ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. చాగల్లు రిజర్వాయర్ నిర్మించినప్పటి నుంచి కాలనీలో విపరీతంగా ఊటనీరు వస్తోందన్నారు. ఆఖరికి మరుగుదొడ్లలో కూడా నీరు వస్తోందని వాపోయారు. ఫలితంగా డెంగ్యూలాంటి విషజ్వరాల బారిన పడుతున్నామన్నారు. అంతేగాకుండా ఇళ్లల్లోకి పాములు, తేళ్లు వస్తుండటండో రోజూ దినదినగండంగా గడుపుతున్నామన్నారు. మరుగుదొడ్లలో ఊటనీరు వస్తుండటంతో ఆడ, మగ తేడా లేకుండా ఆరుబయలకు వెళ్లాల్సి వస్తోందని మహిళలు కన్నీటిపర్యవంతమయ్యారు. ఆఖరికి ఎవరైనా చనిపోతే ఖననం చేయాలన్నా ఆడుగు తీస్తే నీరు వస్తోందన్నారు. చేసేదిలేక నీళ్లలోనే పూడుస్తున్నామని వాపోయారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ ఈసారి బాగా వర్షాలు కురవడం వల్ల చాగల్లు ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉందన్నారు. దీంతో పలు గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా పెద్దయక్కలూరు ఎస్సీ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగానే గ్రామం మొత్తం కలియతిరిగి సమస్యలను గుర్తించామన్నారు. ఇక్కడి వాసుల జీవనం మరీ దారణంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ముఖ్యంగా డ్రెయినేజీ నీటిలా ఊటనీరు వస్తుండటంతో గాలి కూడా కలుషితం అవుతోందన్నారు. ఇక పోలాల్లో జమ్ము పెరగడంతో కొన్ని పొలాలను నిరుపయోగంగా వదిలేసినట్లు గుర్తించామన్నారు. ఆయా సమస్యలపై ప్రభుత్వానికి పనులు నివేదికలు పంపుతామన్నారు. అంతేగాకుండా మరోసారి తమ టెక్నికల్ టీంతో పరిశీలించి గ్రామస్తులు కోరుతున్నట్లుగా పూర్తిగా గ్రామాన్ని మార్చడమా.. లేక పర్యాయ మార్గం ఏమైనా ఉందా అని తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు. ఏదిఏమైనా పెద్దయక్కలూరు ఎస్సీకాలనీ వాసుల సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపిడిఒ రామకృష్ణ, రవిప్రసాద్‌రెడ్డి, జడ్పిటిసి రమాదేవి, గ్రామస్తులు శంకర్‌రెడ్డి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమి

నేరాలు ఘోరాలు

వాటర్‌మెన్ ఆత్మహత్య

గార్లదిన్నె : గార్లదిన్నె పంచాయతీ కార్యాలయంలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్న నల్లప్ప (53) శుక్రవారం ఉదయం పంచాయతీ కార్యాలయం ఆవరణలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన సిబ్బంది హుటాహుటిన 108 ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు నల్లప్పకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

ఉరవకొండ : రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలైన ఘటన విడపనకల్లు మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. విడపనకల్లు మండలం ఉండబండ గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో పాల్తూరు పోలీస్‌స్టేషన్‌లో వీదులు నిర్వహిస్తున్న చంద్రమోహన్ తీవ్రంగా గాయపడ్డాడు. గమణించిన స్థానికులు వెంటనే ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం సవేరా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్లో నుంచి పడి వ్యక్తికి..

గుత్తి : రైలు బోగీలోని డోర్ వద్ద కూర్చొని ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గుత్తి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా తిప్పసముద్రం మండలం కమ్మవారిపల్లెకు చెందిన రమేష్ కారు డ్రైవరుగా పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. పని నిమిత్తం సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. జనరల్ బోగీలో సీట్లు లేకపోతే డోర్ వద్ద కూర్చొని ఉండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జాయి. రెండు గంటలపాటు ముళ్లపదల్లో పడి ఉన్న అతడు తన సెల్‌ఫోన్ ద్వారా 108కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం 108 సిబ్బంది గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు క్షతగాత్రున్ని కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

ఐదుగురికి గాయాలు

తేనెటీగల దాడిలో గాయపడిన మహిళ, పరామర్శిస్తున్న వైసిపి నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి రూరల్ : ఉపాధి హామీ కూలీలపై తేనెటీగలు దాడి చేసిన ఘటన మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఐదుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఉపాధి కూలీలు రోజూలాగా పనులకు వెళ్లారు. ఈ క్రమంలో పనుల్లో నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో పలువురు కూలీలు పరుగులు తీశారు. మరి కొందరికి తేనెటీగలు చుట్టుముట్టాయి. దీంతో గాయాలపాలైన వెంకటమ్మ, బాలహనుమంతు, సునీత, సావిత్రి, నాగలక్షుమ్మను వెంటనే స్థానికులు తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. విషయం తెలుసుకున్న వైపిపి నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి : ఎపి రైతుసంఘం

తాడిపత్రి : తేనెటీగల దాడిలో గాయపడిన ఉపాధి హామీ కూలీలకు మెరుగైన వైద్యం అందించిచాలని ఎపి రైతు సంఘం నాయకుడు రాజారామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామ సమీపంలో తేనెటీగల దాడిలో గాయపడిన ఉపాధి కూలీలను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో రైతుసంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనెటీగల దాడిలో గాయపడిన బాధితులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి, కుటుంబాలకు రూ.50 వేలు ఆర్థికసాయం అందించాలని, అదనంగా పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఫస్ట్ ఎయిడ్ కిట్లును పని ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల కమిటీ కార్యదర్శి రాజారాంరెడ్డి, అధ్యక్షులు బి.సూర్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, జిల్లా కమిటీ సభ్యురాలు శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్టు

అనంతపురం క్రైం : జిల్లాకేంద్రంలో చైన్ స్నాచింగ్స్‌కు పాల్పడిన యువకున్ని అరెస్టు చేసి రూ.3 లక్షల విలువజేసే 5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కళ్యాణదుర్గం రోడ్డు పాపంపేటకు చెందిన రాయపాటి అశోక్‌కుమార్ కిరాణా దుకాణం నడుపుతున్నాడు. అవసరాల నిమిత్తం రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక చైన్ స్నాచింగ్స్ పాల్పడేవాడు. ఇందులో భాగంగానే స్థానిక బళ్లారి బైపాస్ ఎంవైఆర్ ఫంక్షన్ హాల్ దగ్గర, హౌసింగ్ బోర్డు ఎల్ఐజి కాలనీ, వాసవీ బాలికల వసతి గృహం వద్ద, శ్రీనివాస్ నగర్ బాలాజీ కళ్యాణ మండపం వద్ద మహిళల మెడల్లోని చైన్‌లను లాక్కొని పరారయ్యాడు. ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ ప్రసాదరెడ్డి పర్యవేక్షణలో సీఐ కత్తి శ్రీనివాసులు స్థానిక శాంతి నగర్ బోర్డు వద్ద నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈమేరకు నిందితుడిని కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

పెద్దవడుగూరు : విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎంపిడిఒ కుళ్లాయిస్వామి సూచించారు. శుక్రవారం మండలంలోని చిత్రచేడు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న అనుమత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుకు జగనన్న ఆణిముత్యాలు కింద మొదటి బహుమతి అర్చన, రెండవ బహుమతి సాయికృష్ణ, మూడవ బహుమతి షేక్షావలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ హంగులు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. చదువుతోపాటు ఆటపాటలు అవసరమన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. 21 వార్డులో అభివృద్ధి పనుల కోసం రూ.7.5 లక్షలు నిధులు మంజూరైన విషయం తెలిసిందే. ఆ నిధులతో కాంట్రాక్టర్ బేడల వెంకటరాముడు నిర్మిస్తున్న సిసి రహదారి, మురుగు కాలువ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ ఇంతియాజ్, కౌన్సిలర్ వాల్మీకి శివరాం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గుమ్మఘట్ట : మండల పరిధిలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ డివిజన్ కార్యదర్శి ఎస్‌వి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరు శుక్రవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం సమర్పించారు. ముందుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు కొల్లప్ప, రామాంజ నేయులు, నాగరాజు, భీమప్ప, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

19న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ నీలూరి రుషింగప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో ఈనెల 19న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వెంటనే చేనేత ముడి వస్తువులపై జీఎస్టీ పూర్తిగా తొలగించాలని, 11 రకాల చేనేత రిజర్వేషన్ యాక్ట్ అమలు చేయాలని, నేతన్న నేస్తం అర్హులందరికీ ఇవ్వాలని, చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసి మార్కెటింగ్ సౌకర్యం కల్పించి శాశ్వత పరిష్కారం చూపాలని, పట్టు రాయితీ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో వరద కారణంగా నష్టపోయిన చేనేత కార్మికులకు మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వడంతోపాటు వర్క్ షెడ్లు నిర్మించాలని, పవర్ లూమ్స్‌పై అక్రమంగా చేనేత వస్త్రాలను తయారు చేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని, 90శాతం రాయితీతో కంప్యూటర్ సిప్పు అందించాలని, చేనేత గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, పట్టు, నూలు రాయితీ నేరుగా చేనేత కార్మికులకు ఇవ్వాలని, అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 19న చేపట్టనున్న ధర్నాలో చేనేత కార్మికులతోపాటు ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత జాతీయ ఐక్యవేదిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం రామచంద్ర, మండల నాయకులు పురుషోత్తం, వీరాంజినేయులు, నాగరాజు, వెంకటరాముడు, ఓబులేసు, విశ్వనాథ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నాని.. నోరు అదుపులో పెట్టుకోవాలి

జనసేన ఆధ్వర్యంలో మాజీమంత్రి ఫ్లెక్సీకి చెప్పుల దండ వేసి ఊరేగింపు

ప్రజాశక్తి-అనంతపురం

మాజీమంత్రి పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని జనసేన నాయకులు హెచ్చరించారు. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌పై నానీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ ఆదేశాల మేరకు నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా వీరమహిళలు పేర్ని నాని ఫ్లెక్సీకి చెప్పుల దండేసి ఊరేగించారు. ఈ సందర్భంగా జనసేన నగర అధ్యక్షులు బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శి జయమ్మ మాట్లాడుతూ బందర్ గజదొంగ పేర్ని నాని నీతి నిజాయితీకి మారుపేరైన పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. వారాహి యాత్ర ప్రారంభం కాగానే తాడేపల్లి ప్యాలెస్ పునాదులు కదులుతున్నాయన్నారు. ఆ భయంతోనే ప్యాలెస్ నుంచి వచ్చిన స్క్రిప్ట్‌తో పేర్ని నాని పిచ్చి పిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. వారాహిని ఆపడం వైసిపి తరం కాదన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఊరేగింపును అడ్డుకున్నారు. దీంతో నాయకులు, పోలీసులు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సిద్ధూ, జయమ్మ, విజయ్‌కుమార్, నగర ఉపాధ్యక్షులు జిక్కిరెడ్డి నారాయణ, ప్రధాన కార్యదర్శి హుస్సేన్, మురళి, రాజేష్ ఖన్నా, విశ్వనాథ్, శేషాద్రి, వెంకటరమణ, ఆకుల అశోక్, పవన్ కుమార్, కార్యక్రమాల కమిటీ సభ్యులు సంతోష్‌కుమార్, నాయకులు చిరు, శీన, నజీమ్, హరీష్ రుద్రంపేట, నౌషాద్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

సిఎం, విప్‌పై 'కాలవ' ఆరోపణలు తగదు

ప్రజాశక్తి-రాయదుర్గం

సిఎం జగన్, విప్ కాపురామచంద్రారెడ్డిపై ఛార్జిషీట్ వేస్తామని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ప్రకటించడం తగదని వైసిపి నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భోజరాజు నాయక్, డి.హీరేహాల్ మండల కన్వీనర్ వన్నూరు స్వామి మాట్లాడుతూ ఇదివరకూ సెల్ఫీల పేర వీడియోలు విడుదల చేస్తున్న కాలవ శ్రీనివాసులు నేడు ఛార్జిషీట్ పేర తమ నాయకులపై ఆరోపణ చేయడం తగదన్నారు. ఒకవేళ ఛార్జిషీట్ వేయాల్సి వస్తే టిడిని ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతిపై వేయాలన్నారు. ఎన్నికల ముందు టిడిపి విడుదల చేసిన మేనిఫెస్టోను అమలు చేయనందుకు, నీరు-చెట్టు, ఇసుక దోపిడీపై ఛార్జిషీట్ వేయాలని సూచించారు. తమ ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తుంటే లేనిపోని ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కాలవ శ్రీనివాసులు నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. అలాకాకుండా మళ్లీ ఆరోపణ చేస్తే నిరూపించాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ కన్వీనర్ ముస్తాక్, కణేకల్ మండల కన్వీనర్ చిక్కన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రాయదుర్గం మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, రాళ్ల తిమ్మారెడ్డి, రహంతుల్లా, మున్సిపల్ వార్డు సభ్యులు డిష్ గోవింద, వన్నూరుస్వామి, నాయకులు సత్యనారాయణ, ఓబా, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

114 చెరువులకు నీరందించి ఎన్నికలకెళ్లాలి

మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మంత్రి ఉషశ్రీచరణ్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కళ్యాణదుర్గం ప్రాంతంలోని 114 చెరువులకు నీరందించి ఎన్నికల్లో పోటీ చేయాలని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉన్నం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి ఎన్నికల మేనిపెస్టోలో 114 చెరువులకు నీరందించే అంశం లేకపోయినప్పటికీ ఈప్రాంత రైతుల, ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎనలేని కృషి చేశారన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి నాయకులు, జిల్లా మంత్రి ఉషశ్రీచరణ్ కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తమ సొంత పనుల కోసం సిఎం జగన్‌ను కలిసి ఫొటోలు తీయించుకుని 114 చెరువులకు నీరందించాలని కోరామని పేపర్లలో వార్తలు రాయించుకోవడం తగదన్నారు. వైసిపికి చిత్తశుద్ధి ఉంటే చెరువులకు నీరందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, పాపంపల్లి రామాంజినేయులు, ఉన్నం మారుతీ, ఆర్జీ శివశంకర్, గోళ్ళ వెంకటేశులు, కొల్లాపురప్ప, నారాయణ, మల్లికార్జున, గౌని శ్రీనివాసరెడ్డి, రామాంజినేయులు, గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి

నక్కలపల్లిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు తీసుకొచ్చిన పలు సమస్యలను కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు జిల్లా అధ్యక్షుడు ఎంపిపి పెద్దన్న త్రిలోక్‌నాథ్‌రెడ్డి, పాటిల్ నాగిరెడ్డి, సర్పంచి రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శివలింగప్ప, ఎంపిటిసి వరలక్ష్మి, ముత్యాలరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైసిపి నాయకులు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

'ఫుల్ స్టాక్ ఫ్యూజన్'తో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-గుత్తి

ఫుల్ స్టాక్ ఫ్యూజన్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుత్తి రైల్వే డీజిల్ మెకానికల్ ఇంజినీర్ జె.ప్రమోద్ సూచించారు. పట్టణ సమీపంలో ఉన్న గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన ఫుల్ స్టాక్ ఫ్యూజన్ అనే అంశంపై నిర్వహించిన పోటీలు శుక్రవారం ముగిశాయి. ఇందులో భాగంగా ఫుల్ స్టాక్ అప్లికేషన్ వెబ్, మొబైల్‌కు సంబంధించిన రకరకాల అప్లికేషన్లు డెవలప్ చేశారు. పోటీల విజేతలకు నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రైల్వే డీఎంఇ మాట్లాడుతూ ఫుల్ స్టాక్ ఫ్యూజన్ వల్ల ఉద్యోగావకాశాలు అధికంగా ఉంటాయన్నారు. పోటీల వల్ల విద్యార్థులు సాంకేతిక నైపుణ్యతపై పట్టు సాధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథరెడ్డి, ప్రిన్సిపాల్ సూరయా, ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్, ప్రోగ్రాం నిర్వాహకులు ఇంతియాజ్ బాషా, హెచ్ఒడిలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గుత్తి రైల్వే డీజిల్ మెకానికల్ ఇంజినీర్ జె.ప్రమోద్

అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా బాలాజీ

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా బాలాజీ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో అనంతపురంలో మున్సిపాలిటీలో పలు హోదాల్లో పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం విజయవాడ నగరపాలక సంస్థ నుంచి అనంతపురం నగరపాలక సంస్థకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కమిషనర్ రమణారెడ్డిని కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు.

కౌలు భూముల వేలంపాట వాయిదా

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నోబిలంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించి కొనాపురం,రాచర్ల, మూలగిరిపల్లి గ్రామాల్లో ఉన్న భూముల వేలంపాట వాయిదా పడినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆలయ భూములకు వేలంపాట నిర్వహించగా గుత్తదారులు ఎవరూ రాలేదు. దంతో వాయిదా వేస్తూ తీర్మానం చేసినట్లు తెలిపారు.

సచివాలయాల తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని పుట్లూరు, బాలాపురం, కోమటికుంట్ల సచివాలయాలను ఎంపిడిఒ యోగానందరెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ బీమా, జగనన్నకు చెబుదాం, స్పందనలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఏమన్నా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాకాకుండా నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ యోగానందరెడ్డి

విద్యకు అధిక ప్రాధాన్యత

నార్పల : రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వచ్చాక విద్యకు పెద్దపీట వేస్తున్నారని జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ర్పంచి మన్నీల సుప్రియ, ఎంపిటిసి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి రావుపూలే బిసి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు విద్యా కానుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థులందరికీ సిఎం జగన్ ఓ మేనమామలా షూస్, డ్రస్సులు, బ్యాగ్, పుస్తకాలు పంపిణీ చేస్తున్నారన్నారు. పేదింటి పిల్లలు విద్యలో మెరుగ్గా రాణించేందుకు ఎనలేని కృషి చేస్తాన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంగీతకుమారి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినికి కిట్ అందజేస్తున్న నాగరత్నమ్మ, సుప్రియ

టిడిపితోనే 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

యాడికి : మండల పరిధిలోని కుందనకోట, గుడిపాడు గ్రామాల్లో టిడిపి నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీతో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఇటీవల చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే ప్రతి రైతుకూ సంవత్సరానికి రూ.20వేలు, మహిళలకు జిల్లా పరిధిలో ఉచిత బస్సు ప్రయాణం, పేద మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం కార్యక్రమం ద్వారా చదువుకునే ప్రతి బిడ్డకూ సంవత్సరానికి 15 వేలు, యువతకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరి రంగయ్య, నాయకులు బాలాంజనేయులు, శ్రీనివాసులు, నీలకంఠ, బాలచంద్ర పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వహించొద్దు

అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

గుంతకల్లు : గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయకుండా నెలవారీగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి సూచించారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో అంగన్వాడీ కేంద్రంలో జనబాగీదారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా నెలవారీగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలు అందజేశారు. అదేవిధంగా స్కూల్ పిల్లలకు ఐరన్ మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రేష్మా, సరోజా, పెద్దక్క, భారతి, సుశీల, వీరేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.